నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 03 మార్చి 2025 | www.navatelangana.com

ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి భరత్ కుమార్



నవతెలంగాణ-చేర్యాల

విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రయివేట్ ఇంటర్ మీడియట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాల్ టికెట్స్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న చేర్యాల పట్టణ కేంద్రంలోని ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భరత కుమార్ మాట్లాడుతూ.. ఫీజుల పేరిట విద్యార్థులను తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకొని విద్యార్థులను ఎలాంటి ఇబ్బందులకు గురి చెయ్యకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, సమీర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలు శుభ్రం చేయించిన కమిషనర్

నవతెలంగాణ కథనానికి స్పందన...



నవతెలంగాణ-దుబ్బాక

2 న నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన "మోరీలు తీస్తలేరు.. ఫాగింగ్ చేస్తలేరు" అన్న కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. దుబ్బాక మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ఆదివారం తన సిబ్బందితో కలిసి పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో మురికి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను,నీటిని తొలగింపజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని.. వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఆయన వెంట వర్క్ ఇన్ స్పెక్టర్ బుస్స ప్రవీణ్ కుమార్,ఇన్చార్జి శానిటరీ ఇన్ స్పెక్టర్ దిలీప్,పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

పడకేసిన జీపీ భవనాల నిర్మాణం



- 2018లో మంజూరు.. పూర్తికాని వైనం
- రూ.4 లక్షలు అదనంగా నిర్మాణ వ్యయం పెంచినా అదే పరిస్థితి
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 261 భవనాలు
- పనుల్లో వేగం పెంచని కాంట్రాక్టర్లు
- పంటించుకోని పంచాయతీరాజ్ ఇంజినీర్లు

> గ్రామ పంచాయతీ పాలనా వ్యవస్థ వ్యవహారాలు నిర్వహించేందుకు సొంత భవనాల్లేని గ్రామాలు అనేకమున్నాయి. వాటికి సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు ఆందోళన చేసిన ఫలితంగా గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. కానీ, ఇప్పటి వరకు వాటి నిర్మాణం పూర్తికాలేదు. వివిధ దశల్లో పంచాయతీ భవనాల నిర్మాణం ఆగిపోయింది. ఏడేండ్లుగా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతునే ఉన్నాయి. మొదట్లో మంజూరు చేసిన నిధులు సరిపోకపోవడంతో అదనంగా రూ.4 లక్షలు కేటాయించినా పనుల్లో ప్రగతి కనిపించట్లేదు. పెరిగిన ధరల భారం వల్ల పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పనుల్ని పర్యవేక్షించి పూర్తి చేయించాల్సిన పంచాయతీరాజ్ ఇంజినీర్లు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కనీసం కొత్త పాలక వర్గాలు ఏర్పడే నాటికైనా కొత్త భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతో పాటు చాలా గ్రామాల్లో పంచాయతీ భవనాల్లేవు. అద్దె భవనాల్లోనే గ్రామ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు సందర్భంగా మండల కేంద్రాల్లో అవసరమైన ప్రభుత్వ శాఖలకు భవనాలు నిర్మించినప్పటికీ గ్రామ పంచాయతీలకు మాత్రం నిర్మించలేదు. పాలకవర్గాలు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహించేందుకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజల నుంచి డిమాండ్ రావడంతో 2018లో రాష్ట్ర వ్యాప్తంగా అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 261 గ్రామ పంచాయతీల్లో నూతన భవనాల్ని నిర్మించాల్సి ఉందని పంచాయతీ రాజ్ ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపారు. ఒక్కో గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం రూ.18 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

పడకేసిన భవనాల నిర్మాణం..

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణ పనులు పడకేశాయి. ఏడేండ్ల కిందట నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పది శాతం నిర్మాణం కూడా పూర్తికాలేదు. సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలుండేవి. ఇటీవల కొన్ని మున్సిపాలిటీల్లో విలీనమవ్వడంతో ప్రస్తుతం 633 ఉన్నాయి. పంచాయతీలకు సొంత భవనాల్లేని 95 గ్రామాలకు కొత్త భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 16 మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. 68 పంచాయతీల్లో పనులు వివిధ దశల్లో ఉండగా, 13 చోట్ల పనులే ప్రారంభించలేదు. జిల్లాకు రూ.24.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సంగారెడ్డి, కంది, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్ వంటి ప్రాంతాల్లో పంచాయతీ భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. మెదక్ జిల్లాలో 97 నూతన భవనాల నిర్మాణం కోసం రూ.19.24 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటిల్లో 13 కూడా పూర్తికాలేదు. సిద్దిపేట జిల్లాలో 67 గ్రామాల్లో నూతన భవనాల నిర్మాణం కోసం రూ.13.80 కోట్లు మంజూరయ్యాయి. సిద్దిపేట ప్రాంతంలో 11, హుస్నాబాద్ ఏరియాలో 17, చేర్యాల ప్రాంతంలో 19 మిగతావి ఇతర ప్రాంతాల్లో మంజూరయ్యాయి. ఇక్కడ కూడా పనుల పరిస్థితి నత్తనకడనకే సాగాయి.

పెరిగిన ధరలు.. సరిపడని నిధులు

నిర్మాణ రంగంపై ధరల పెరుగుదల ప్రభావం తీవ్రంగా పడింది. ఐరన్, ఇసుక, ఇటుక, కలప, కంకర ఇతర మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో నిర్మాణ వ్యయం భారమైంది. ఈ ప్రభావం ప్రభుత్వ భవనాల నిర్మాణంపై కూడా పడింది. దాంతో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం పనులు కుంటుపడ్డాయి. 2018లో అప్పటి ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.18 లక్షల చొప్పున మంజూరు చేసింది. అప్పటి ధరలను బట్టి అంచనా వ్యయం నిర్ణయించారు. అప్పట్లో భవనాల నిర్మాణం ఆలస్యం అయింది. దీంతో పాత నిధులు సరిపో లేదని కాంట్రాక్టర్లు పనులు చేయలేదు. ప్రభుత్వం మరో రూ.4 లక్షలు కేటాయించింది. రూ.22 లక్షలతో పనులు మొదలు పెట్టినప్పటికీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, వరుస ఎన్నికల వల్ల పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పటికీ మెదక్ ఉమ్మడి జిల్లాలో 261 పంచాయతీ భవనాలకు 52 మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నారు.. 45 చోట్ల పనులు ప్రారంభమే కాలేదు. పెరిగిన వ్యయానికి తగినట్టుగా నిధులు పెంచాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం నిధులు పెంచకపోతే నిర్మాణం పూర్తి అయ్యే పరిస్థితి లేదు. కనీసం కొత్త పాలక వర్గాలు ఏర్పడే నాటికైనా కొత్త భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల్ని పూర్తి చేయిస్తాం.. : జగదీష్ పిఆర్ఈఈ

గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణాల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని చోట్ల పనులు పూర్తి కావస్తున్నాయి. వివిధ దశలో ఉన్న వాటిని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నాం. మెటీరియల్ ధరలు పెరిగిన ప్రభావం ఉంది.

గుగ్గీల్ల పంచాయతీలో చెత్త సేకరణ..

- చెత్తను సేకరించిన ..
- తాగు నీటీ సరఫరా పైపులైనుకు మరమ్మతులు
- శుభ్రమైన మురికికాల్వలు
- పంచాయతీ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపిన పలువురు గ్రామస్తులు




నవతెలంగాణ
ఎక్కడి చెత్తక్కడే.. జాడలేని ప్రత్యేకాధిరులు

నవతెలంగాణ-బెజ్జంకి

ఎక్కడి చెత్తక్కడే..జాడలేని ప్రత్యేకాధిరులు శీర్షికతో నవతెలంగాణ దినపత్రిక ఆదివారం కథనాన్ని ప్రచురించింది. గుగ్గీల్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి కొంపల్లి వంశీధర్ కథనానికి స్పందించారు. ఉదయం పంచాయతీ సిబ్బందితో గ్రామంలో పెరుకుపోయిన చెత్త నిల్వలను ట్రాక్టర్ ద్వారా సేకరించి, మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్న మురికికాల్వలను శుభ్రం చేయించారు. స్థానికురాలు పతంగి సత్తవ్వ గృహనికి తాగు నీరు సరఫరాయ్యే పైపులైనుకు మరమ్మతులు పనులు పూర్తి చేయించారు. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తూ అనుధినం.. జనస్వరమంటూ ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేల కృషి చేస్తున్న నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, త్వరితగతిన స్పందించి సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతున్న పంచాయతీ కార్యదర్శి వంశీధర్‌కు పలువురు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

జనసంద్రమైన మల్లన్న ఆలయం



- జోరుగా సాగిన ఏడో వారం
- పట్నాలు వేసి బోనాలు చెల్లింపు
- దర్శనానికి మూడు గంటల సమయం

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏడో వారం ఆదివారం జాతరకు వేలాదిగా పోటెత్తారు. ఆలయ పరిసరాలన్నీ జనసంద్రంతో నిండిపోయాయి. తలనీలలు సమర్పించి ధర్మగుండంలో స్నానమాచరించిన భక్తులు మల్లన్నకు బోనం నివేదించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కోరిన కోరికలు నెరవేర్చాలని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. అనంతరం శీఘ్ర, అతి శీఘ్ర, ధర్మ దర్శనాల ద్వారా క్యూ క్యూలైన్లలో వెళ్లి దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. అనంతరం విజయచల గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి బెల్లం పానకం కల్లుసాక పోసి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు, ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ సూపరింటెంట్, బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఏర్పాట్లు ను పరిశీలించగా చేర్యాల సిఐ ఎల్ శ్రీను కొమురవెల్లి ఎస్ఐ రాజు భారీ బందోబస్తు నిర్వహించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేర్యాల

మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామనికి చెందిన బీఆర్ఎస్ సినియర్ నాయకులు గజ్జల రామ్మోహన్ రెడ్డి-శ్రీలత కుమార్తె ప్రమోదిని వివాహం ఆదివారం చేర్యాల పట్టణంలోని ఓ గార్డెన్‌లో జరిగింది. ఈ వివాహ వేడుక కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడమే నిజమైన స్నేహానికి నిదర్శనం



నవతెలంగాణ-రాయపోల్

కష్టాలలో ఉన్నప్పుడు మేమున్నామంటూ చేయూతనివ్వడమే నిజమైన స్నేహానికి నిదర్శనం. రాయపోల్ పదవ తరగతి 2007- 2008 బ్యాచ్ కి చెందిన స్నేహితులలో ఒకరైన రాయపోల్ గ్రామానికి చెందిన బ్యాగరి రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం వారి కుటుంబ సభ్యులను స్నేహితులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతోపాటు కలిసి చదువుకున్న బ్యాగరి రమేష్ కుటుంబానికి భరోసాను కల్పించడానికి రూ.41 వేలు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ 2007-2008 బ్యాచ్ స్నేహితులు పంబాల వెంకటేష్, కొంగరి స్వామి, అరికెల కరుణాకర్, సింగరబోయిన ఆంజనేయులు, లోట్ల మధుసూదన్ రెడ్డి, మాదాస్ నర్సింలు గౌడ్, గ్రామస్తులు పుట్ట కరుణాకర్, బ్యాగరి స్వామి, బ్యాగరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నోటీసులిచ్చారు.. తరలింపు మరిచారు

- మురికి పక్కన యథావిధిగా మాంస విక్రయాలు
- సమీకృత మార్కెటుకు తరలించడంలో అధికారుల నిర్లక్ష్యం





మురికి పక్కనే.. మాంస విక్రయాలు

నవతెలంగాణ-బెజ్జంకి

గత కొద్ది రోజుల క్రితం బాయిలర్ కోడి మాంసంతో బర్డ్ ఫ్లూ వైరస్ విజృభింస్తుందని ప్రభుత్వం కొన్ని రోజులు విక్రయాలపై అంక్షలు విధించింది. మండల కేంద్రంలో మురికి పక్కన మాంసం విక్రయాలు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని ఫిబ్రవరి 7, 2025న నవతెలంగాణ దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు ఫిబ్రవరి 23,2025న మురికికాల్వ, రోడ్లపైన మాంస విక్రయదారులకు 3 రోజుల్లో ఎవరికి వారే తమ మాంస విక్రయ కేంద్రాలను సమీకృత మార్కెటుకు తరలించాలని ఉల్లంఘిస్తే పంచాయతీ రాజ్ చట్టం(2018)ప్రకారం చర్యలు చేపడుతామని పంచాయతీ సిబ్బంది నోటిసులందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా పంచాయతీ సిబ్బంది నోటిసులందజేసిన పంచాయతీ సిబ్బంది మాంస విక్రయదారులను సమీకృత మార్కెటుకు తరలించడం మరిచారు. దీంతో ఆదివారం మురికికాల్వ, రోడ్లపై మాంస విక్రయదారులు యథేచ్చగా విక్రయాలు సాగించడం ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ సిబ్బంది నోటిసులందజేసిన ప్రకారం చర్యలు చేపట్టడంలో వెనుకంజ వేయకుండా తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. నోటీసులందజేసిన పంచాయతీ సిబ్బంది ఇప్పటికైనా మాంస విక్రయ కేంద్రాలను తరలించేల చర్యలు చేపడుతారో లేకా ప్రజల ఆరోగ్యం ఎలా వుంటే మాకెంటీ..? మాకు మా వేతనమైతే నెలనెల అందుతుంది. కదాంటూ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తారో వేచి చూడాల్సిందే.

సన్‌ఫ్లవర్ రైతుల కష్టాలు మీకు పట్టవా..!

- ముఖ్యమంత్రికి లేఖ రాసిన హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి, రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం జరిగింది. సమయానికి రైతుబంధుతో పాటు సబ్సిడీలు అందజేసి నూనె గింజల పంటలను సాగు చేసేలా ప్రోత్సాహం కల్పించాము. సాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాము. నాటి ప్రణాళికా బద్ధంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నూనె పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొద్దుతిరుగుడు(సన్ ఫ్లవర్) పంట కోతకు వచ్చింది. సన్ ఫ్లవర్ గింజలను విక్రయించడానికి ఇప్పటిదాకా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. దీనివల్ల రైతులు రూ. 5,500 నుంచి రూ. 6000 వరకు దళారులకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్న పరిస్థితి దాపురించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాఫెడ్ ద్వారా సన్ ఫ్లవర్ నూనె గింజలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేశాము. ఈసారి కూడా రూ. 7280 మద్దతు ధరను నాఫెడ్ ప్రకటించింది. కానీ ఇప్పటిదాకా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులకు విక్రయించడం వల్ల క్వింటాల్ కు రూ. 1000 నుంచి రూ. 2000 వరకు నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి రైతులకు కలిగింది. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా సన్ఫవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల పక్షాన నేను డిమాండ్ చేస్తున్నాను. మీ అలసత్వం కారణంగా తెలంగాణ వ్యవసాయం తిరో గమన దిశలో పయనిస్తున్నది. నూనె పంటలు వేయాలంటేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులను మీరు కల్పిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి. రేపటి నుండే రాష్ట్రమంతటా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ఆదేశించండి. ఎన్నికల కోడ్‌తో రైతుల కష్టాలకు ముడి పెట్టకుండా ఒక ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేక ద్వారా కోరారు.

మంత్రుల పీఏలకు డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకుంటారా..?



- మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకొంటున్న శ్రీకాంత్ ఆయన వర్గీయులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ అన్నారు. ఆదివారం ముత్రాజ్పల్లి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గాంధీభవన్లో తిరుగుతూ మంత్రుల పిఏలకు డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చెందిన వ్యక్తులు కాదని నర్సారెడ్డి పై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఏనాడు కూడా పార్టీ కోసం శ్రీకాంత్ ఆయన వర్గీయులు పనిచేయలేదని వారు పేర్కొన్నారు. ఎన్నికల్లో వచ్చిన డబ్బును తాము ఎక్కడ కూడా తీసుకోలేదని పార్టీ నుంచి అభ్యర్థి నుంచి వచ్చిన డబ్బును పార్టీ కోసమే ఖర్చు చేశామని వారు చెప్పారు. పార్టీ కోసం బండారు శ్రీ కాంతారావు, నాయిని యాదగిరి, మల్లారెడ్డి ఆస్తులు భూములు అమ్ముకున్నారా అని ప్రశ్నించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పార్టీ కోసం 100 ఎకరాల భూమి ఉంటే చివరకు పది ఎకరాలు మిగిలిందని వారు గుర్తు చేశారు. తాము కాంగ్రెస్ పార్టీలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నామని శ్రీకాంత్ రావు వర్గం గాంధీభవన్లో మంత్రుల వద్ద పీఏ లను పట్టుకొని వారికి డబ్బులు ఇచ్చి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మోహన్, గుంటుకు శ్రీనివాసు, రమేష్ గౌడ్, శివారెడ్డి, వహీదు, యాదగిరి, జహీర్, రవీందర్ రెడ్డి, మల్లేశం యాదవ్ వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ సంపన్నులకు అనుకూలం



- కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి
- సీఐటీయూ దేశవ్యాప్త ఉద్యమం
- తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ మల్లికార్జున్

నవతెలంగాణ-గజ్వేల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు అనుకూలంగా, కార్మిక ప్రజావ్యతిరేక బడ్జెట్ అని, కార్మికులకు నష్టం చేసి, పరిశ్రమ యజమాన్యాలకు అనుకూలంగా కార్మిక కోడ్లను తయారు చేసిందని, వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు జొన్నలగడ్డ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప ఫంక్షన్ హాల్ రానే బ్రేక్ లైనింగ్ యూనియన్ సీఐటీయూ సర్వసభ్య సమావేశం ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య మధ్యతరగతి ప్రజలపై 30శాతం పన్నులు భారం వేసి నడ్డి విరుస్తుందని, కార్పొరేట్ సంపన్నులపై 32 శాతం ఉన్న 22 శాతానికి కుదించిందని విమర్శించారు. సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే కార్మిక కోడులు కార్మికులందరికీ నష్టం చేస్తాయని పని గంటల పెంపుదలతో పాటు వేతనాలు, సంక్షేమ పథకాలు, కార్మిక హక్కులు నిర్వీర్యం అవుతాయన్నారు. పరిశ్రమల్లో యూనియన్ లేకుండా చేయడం, కార్మికులందరిని బానిసలుగా మార్చే విధంగా కోడ్‌లు రూపొందించడం జరిగిందన్నారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకుంటామని కార్మిక కోడులకు వ్యతిరేకంగా భవిష్యత్తులో దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని కార్మిక వర్గమంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధాలపై పోరాటం చేయాలని కార్మికులంతా ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, యూనియన్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రంగారెడ్డి, స్వామి శ్రీనివాస్ వెంకట్రావు రవికుమార్ నర్సింలు సాజిద్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం



నవతెలంగాణ-సిద్దిపేట

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలులో కార్మికీలకు వచ్చే బెన్ఫిట్స్ ఇవ్వకుండా ఈ ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జనవరి 31న లేబర్ బోర్డు డిప్యూటీ కమిషనర్‌కు హైదరాబాదులో వినతి పత్రం అందజేయడం జరిగిందని, ఇప్పటివరకు లేబర్ బోర్డు కమిషనర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేయకపోవడం కార్మికుల పక్షాన చర్చించకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు రూ 5వేల పింఛన్ అందించాలని, కార్మికుల పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని, మృతి చెందిన వారికి తక్షణమే పరిహారం అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని, బీమా పాలసీని పెంపు పొందే విధంగా చూడాలని, భవన నిర్మాణ కార్మికుల పక్షాన కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించనున్న ఇందిరమ్మ ఇళ్లను భవన కార్మికులను ముందు జాబితాలో చేర్చే విధంగా చూడాలన్నారు. 55 సంవత్సరాల పైబడిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే కార్మిక శాఖ మంత్రిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాశీబ్, రాష్ట్ర కార్యదర్శి లు తోట్ల పర్శారములు, రాచమల్లు కొమురయ్య, రాష్ట్ర సలహాదారుడు నాయిని రామస్వామి, తదితరుల పాల్గొన్నారు.

ఐఐహెచ్ ప్రాజెక్టు ఎంపికైన దామరకుంట విద్యార్థులు



నవతెలంగాణ-మర్కుక్

జాతీయ సైన్స్ దినోత్సవం 2025 సంవత్సరంగాను ఐఐటీ హైద్రాబాద్, రూరల్ డెవలప్మెంట్ సెంటర్ అండ్ ప్రయాస వారు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా, మర్కుక్ మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు మర్కుక్ ఎంఈవో వెంకట రాములు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు వై.చిన్న బ్రమయ్యలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మార్చి1న, ఐఐటీ హైద్రాబాద్ నందు నిర్వహించిన సృష్టి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో జెడ్పీహెచ్ పాఠశాల దామరకుంటకు చెందిన విద్యార్థుల టీం, ఎస్.ఆశ్వంత్, ఎస్. కార్తీక్ చారి, బీ.విక్లేష్, ఉపాధ్యాక్షులు వై. చిన్న బ్రహ్మయ్య భౌతిక శాస్త్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ప్రాజెక్టు మొదటి 10 అత్యుత్తమ ప్రాజెక్టుల విజేతల్లో ఐఐహెచ్ ప్రాజెక్టు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి హజరై విజేతలకు మెమెంటోలు అందజేసి అభినందించారు. ఏప్రిల్ లేదా ఆగస్టు 2025 నెకలో జరిగే ఐఐహెచ్, ఐఐటీ హైదరాబాదులో జరిగే జాతీయ కార్యక్రమానికి అర్హత సాధించారని తెలియజేశారు. విద్యార్థులను దామరకుంట పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మసీదుల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

నవతెలంగాణ-జహీరాబాద్



పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైనందున పట్టణంలోని మసీదుల వద్ద పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని జహీరాబాద్ మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్డిఓ రాంరెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు ఈద్గా కమిటీ అధ్యక్షులు మహమ్మద్ మజీద్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్, పట్టణ ఎస్సైలకు కూడా వినతిపత్రాలు అందజేశామన్నారు. పండగ సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మసీదుల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని.. ట్రాఫిక్ నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఇనాయత్, మహమ్మద్ అయూబ్, మహమ్మద్ ఫరూక్, నసీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4,00,000 ఎల్వోసీ అందజేత

నవతెలంగాణ-జహీరాబాద్



కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంగలి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఆమెకి అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.4 లక్షల ఎల్వోసీని ఎమ్మెల్యే మాణిక్‌రావు మంజూరు చేయించి.. వారి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ రామకృష్ణ రెడ్డి, మాజీ ఆత్మ చైర్మెన్ విజయ్‌కుమార్, పార్టీ కోహీర్ మండలాధ్యక్షులు నర్సింలు, జహీరాబాద్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, సీనియర్ నాయకులు నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైదిక పఠనంతో గాడిలో పడనున్న జీవితాలు

నవతెలంగాణ-మునిపల్లి

వైదిక పఠనంతో విద్యార్థుల జీవితాలు గాడిలో పడుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా అన్నారు. మండలంలోని బుదేరాలో వైదిక పాఠశాల భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రతీఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. వేదపఠనంతో భక్తి పరమైన విశ్లేషణలు చేయడానికి వైదిక పాఠశాలలు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బర్దిపూర్ పీఠధిపతి దత్తగిరి మహారాజ్,మాజీ ఎంపీపీ రాం రెడ్డి, ఏఎంసి చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్, మనోపశర్, రహీం తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-రాయికోడ్

మండల పరిధిలోని శంషోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నర్సింలు కూతురు వివాహంలో, అల్లాపూర్ హల్గెర గ్రామంలోని బీఆర్ఎస్ నాయకుడి వివాహ వేడుకలో ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వ దించారు. అనంతరం పిపడ్‌పల్లి మాజీ సర్పంచ్ రవీందర్ కుమార్ తల్లి నాగమ్మ మరణించడంతో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండ లాధ్యక్షులు విట్టల్, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మండల ఉపాధ్యక్షులు మల్లేశం, మండల బీసీ సెల్ అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ సర్పంచులు శంకర్, నాయకులు తుకారం, రాములు, నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గాలి పోచమ్మ తల్లి జాతర

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని గడ్డపోతారం మున్సిపాల్టీ కిష్టయ్యపల్లిలో గాలి పోచమ్మ తల్లి జాతరను ఆలయ నిర్వహకులు, గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పులిగిల్ల ప్రకాశం చారి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డిలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బాసెట్టిగారి రాజు ఆకుల భార్గవ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి గణేష్, అమ్మగారి సదానందరెడ్డి, మొగులయ్య, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లేష్ నల్తూర్ యాదగిరి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

25 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన మిత్రులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ- జోగిపేట

అందోల్ మండలం జోగిపేట స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల 1999-2000 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సంగారెడ్డిలోని శివ బ్యాంకెట్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులకు పుష్పగుచ్చాలు అందజేస్తూ వేదికపై స్వాగతం పలికారు. స్నేహితులందరూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరెస్పాండెంట్ ఆర్. ప్రభాకర్ గౌడ్ ఉపాధ్యాయ బృందాన్ని విద్యార్థులు శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్. ప్రభాకర్ గౌడ్, దయాకర్ గౌడ్, కృష్ణ, పద్మ రాణి, రాజు గౌడ్, చారి, మల్లికార్జున్ గౌడ్, సురేష్, సిద్దేశ్వర్ విద్యార్థులు, రాకేష్, రాజేష్, సంతోష్, సందీప్, రాజు, సర్వేశ్వర్, జావేద్, రమేష్, సుమలత, చండీ ప్రసన్న, రమ్య జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



జిన్నారంలో ఘనంగా పోచమ్మ ఉత్సవాలు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారం లో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయ ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.జిన్నారం మాజీ ఎంపీపీ అధ్యక్షులు దమ్మగౌని రవీందర్ గౌడ్ దాతృత్వంతో నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రకటించారు. నాలుగు రోజుల పాటు సాగుతున్న పోచమ్మ తల్లి ఉత్సవాలను జయప్రదం చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా.. ఉజ్వల్‌రెడ్డి!



ముఖ్య నాయకులందరి మద్దతు ఆయనకే?

- మంత్రి అండదండలు కూడా..
- ఇప్పటికే ఆయనకు మద్దతుగా పలువురు ప్రముఖులు ఉత్తరాలు పంపినట్టు సమాచారం..

నవతెలంగాణ-జహీరాబాద్

అధికార పార్టీకి సంగారెడ్డి జిల్లాలో నూతన డీసీసీ అధ్యక్షులను నియమించి పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తుంది. జిల్లాలో పాత, కొత్త అనే తేడా లేకుండా అందరికీ పార్టీలో భాగస్వామ్యం కల్పించి.. పార్టీని దృఢంగా చేసినప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను సాధించొచ్చని అధిష్టానం నిర్ణయించినట్టు సమాచారం. సంగారెడ్డి జిల్లాపై బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రభావం ఎక్కువగా ఉన్నందున వారిని తట్టుకొని పార్టీని పటిష్టపరిచే నాయకున్ని ఎన్నుకునేందుకు జిల్లాలోని కీలక నాయకులందరూ కలసి ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అందుకోసం ఎన్నారై, జహీరాబాద్ మండలం మాజీ ఎంపీపీ చిరాకుపల్లి నారాయణరెడ్డి కుమారుడైన డాక్టర్ ఉజ్వల్‌రెడ్డికి డీసీసీ బాధ్యతలు అప్పగించేందుకు అంతా సిద్ధమైనట్టు విశ్వసనీయ సమాచరం.

ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంటు స్థాయిలో పార్టీలో నాయ కులందరినీ సమన్వయపరిచి యువకులతో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఉజ్వల్ రెడ్డికి జహీరా బాద్ పార్లమెంటుతో పాటు పార్టీ జాతీయ అధ్యక్షుని వరకు మంచి సంబంధాలు ఉన్నాయి. కిందిస్థాయి కార్యకర్తల నుండి అందరితో మంచి సంబంధాలు ఉన్న ఉజ్వల్‌రెడ్డిని పార్టీ డిసిసి అధ్యక్షునిగా నియ మించాలని జిల్లాలోని ముఖ్య నాయకులు ఒక నిర్ణయానికి రావడంతో పాటు పీసీసీ అధ్యక్షుని వద్దకు కూడా సమాచారాన్ని చేరవేసినట్లు తెలు స్తోంది. కాగా అంతా సిద్ధమై.. ఉజ్వల్ రెడ్డి నియామకం లాంచనమే అని స్థానికంగా చర్చ సాగుతోంది.

మంత్రి దామోదర్ రాజనర్సింహ మొగ్గుతోనే..

ఆది నుంచి జహీరాబాద్ నియోజకవర్గం పై తనకంటూ ముద్ర వేసుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ.. ఉజ్వల్ రెడ్డిని డీసీసీ డిసిసి అధ్యక్షునిగా నియమించేందుకు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నారాయణఖేడ్ శాసనసభ్యులు సంజీవరెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన జగ్గారెడ్డి సైతం ఉజ్వలరెడ్డికి మద్దతు ప్రకటించి.. పార్టీ ప్రముఖులు ఉజ్వల్ రెడ్డికి మద్దతుగా ఉత్తరాలు ఇచ్చినట్టు సమాచారం. జహీరాబాద్ నియోజకవర్గంతో పాటు పార్లమెంటు పరిధిలో ఏ కార్యక్రమం చేపట్టినా సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ గిరిధర్‌రెడ్డితో చేదోడు వాదోడుగా ఉంటున్న ఉజ్వల్ రెడ్డికి డిసిసి పదవి పించేందుకు గిధర్ రెడ్డి కూడా తనకంటూ ప్రయత్నాలు వేగం చేసినట్టు చర్చ జరుగుతోంది టీజీఐడీసీ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ కూడా ఉజ్వల్‌రెడ్డికి మద్దతు ప్రకటించినట్లు తెలిసింది. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి చంద్రశేఖర్, పటాన్చెరు నియోజకవర్గం నుండి కూడా ఇంకా ఉజ్వల్ రెడ్డికి మద్దతుగా ఉత్తరాలు ఇవ్వలేదని సమాచారం. పార్టీ అధినాయకత్వంతో పాటు జిల్లాలోని ప్రముఖులు వారితో చర్చించే సమన్వయ పరిచేందుకు చర్యలు చేపట్టినట్టు గుసగుసలు నడుస్తున్నాయి. ఇటీవలే జహీరాబాద్‌లో ఒక శుభకార్యానికి హాజరైన మంత్రి దామోదర్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు ఈ విషయమై చర్చించినట్లు తెలుస్తోంది. మంత్రి అండదండలు ఉండడంతో ఉజ్వల్ రెడ్డి నియామకం జరిగిపోయినట్లేనని ఆయన అభిమానులు ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యావేత్త.. మృధు స్వభావి

డాక్టర్ ఉజ్వల్ రెడ్డి అమెరికాలో స్థిరపడినప్పటికీ కేవలం జిల్లా రాజకీయాల్లో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో అక్కడ తన ఉద్యోగానికి రాజీనామా చేసి జహీరాబాద్ వచ్చారు. గత 15 ఏండ్లుగా వివిధ రకాల సేవా కార్యక్రమాలను చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. పార్టీ కార్యక్రమాలు చేపడుతున్న వారిని గుర్తించి.. ప్రోత్సహిస్తుండడంతో ఆయనకు అడగడుగునా కార్యకర్తలు మద్దతు పెరిగిపోతుంది. స్వగ్రామంలో తన సొంత నిధులతో ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు ఇటీవల తన తండ్రితో శంకుస్థాపన చేయించిన విషయం తెలిసిందే. గతంలో రాష్ట్రంలో తీవ్ర కరువు సంభవించినప్పుడు నియోజకవర్గంలో పాటు వివిధ ప్రాంతాల్లో తన సొంత ట్యకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసి అందరి మన్ననలు పొందారు. యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు టోర్నమెంట్లను ఏర్పాటు చేసి ప్రోత్సహించడంతో ఏ నియోజకవర్గం లకి వెళ్లిన ఉజ్వల రెడ్డికి అభిమానులను పెరిగిపోతున్నారు.

డీసీసీ అధ్యక్షునిగా నియమిస్తే..

డీసీసీ అధ్యక్షుడిగా ఉజ్వల్‌రెడ్డి నియామకం జరిగితే పార్టీలో నూతన ఉత్సాహంతో పాటు ఉత్తేజం నెలకొంటుందని పార్టీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఆయన మృధువైన స్వభావమే ఆయనను డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తుందని అభిమానులు అంటున్నారు. కాగా పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి మరి.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్
- జహీరాబాద్‌లో ఆర్యవైశ్య సంక్షేమ భవనం ప్రారంభం

నవతెలంగాణ-జహీరాబాద్

ఆర్యవైశ్యుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎంపీ సురేష్ షెట్కర్, మాజీ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమామహేశ్వర స్వామి కళ్యాణోత్సంలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని అనంతరం ఆర్యవైశ్య భవనం ప్రారంభిం చారు. నిర్వహకులు ఈ సందర్భంగా జ్ఞాపికను అందచేసి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో టీజీఐడీసీ మాజీ చైర్మెన్ తన్వీర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, మంకల్ సుభాష్ ,శుక్లవర్ధన్ రెడ్డి, అశోక్, రాకేష్ గుప్త, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశం నామరవి కిరణ్, కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఎంపీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

కల్‌బేమల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు బోజిరెడ్డి, మెటల్‌కుంట ప్రవీణ్ నూతన గృహప్రవేశ వేడుకలకు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కర్, మాజీ మంత్రి చంద్రశేఖర్.. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందు బాటులో ఉంటామన్నారు. కాగా వారు వేడుకలకు హాజవరడం పట్ల ఆ కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త పల్లి భాస్కర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, చంద్రప్ప, సిద్ధి లింగయ్య స్వామి, బలరాం రెడ్డి, రత్నం, శివరాజ్ పాటిల్, అబ్బాస్, స్వామిదాస్, సామేల్, శేఖర్, తదితరులున్నారు.



ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

- సామాన్యుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం
- నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ-పటాన్‌చెరు



పేదల ఆరోగ్య పరిరక్షణకు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటేస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్ గ్రామంలో నీలం మధు సహకారంతో ఓ ప్రైవేట్ టీవీ ఛానల్- మెడీ స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో సామాన్యులకు ఉచి త వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కాలుష్యం, రసాయ నాలతో పంటల్ని పండించడం, కలుషిత ఆహారం తీసుకోవడం, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం వలన అనేక వ్యాధుల బెడద పెరిగిందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా తమ రోగాన్ని తెలుసుకుంటే తగిన చికిత్స తీసుకోవడానికి ఆస్కారం దొరుకుతుందని, దీంతో వ్యాధి ప్రారంభంలోనే స్వల్ప కాలిక చికిత్సలతో నయం చేసుకోవచ్చన్నారు. అయితే ప్రజలలో వ్యాధుల పట్ల అవగాహన లోపంతో పాటు పేదరికం వలన చాలా మంది వ్యాధి నిర్ధారణ పరీక్షలకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. దీంతో వ్యాధులు ముదరడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు తప్పనిసరిన్నారు. వైద్య శిబిరాల్లో ఏర్పాటు చేసే రోగ నిర్ధారణ పరీక్షలతో వ్యాధిని తెలుకుని అందుకు తగిన చికిత్స చేస్తారని స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనర్థం ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపు ను ప్రతి ఒక్కరూ విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మెగా మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేసిన ప్రైవేట్ టీవీ ఛానల్- మెడిస్టార్ హాస్పిటల్ వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో మెడి స్టార్ హాస్పిటల్ ఎండి డాక్టర్ కిరణ్,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లత, డాక్టర్లు రాష్మిక, శివ మోహన్ రెడ్డి,సంతోష్, ప్రకాశ్,కాంగ్రెస్ నాయకులు పొట్టి నారాయణరెడ్డి, వి నారాయణ రెడ్డి, చాకలి వెంకటేష్ , వల్లేపు వెంకటేష్, సుంకరి బుజ్జి, గౌరీ శంకర్, అనిల్, శ్రీను,మెడికల్ క్యాంపు నిర్వాహకులు, డాక్టర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-జోగిపేట

జాతీయ రహదారి 161 ఆకోల నాందేడ్ రహదారిపై అల్మాయిపేట గ్రామ శివారులో రాజన్న యువసేన, రవి శంకర్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం మినరల్ వాటర్‌తో కూడిన చలివేంద్రాన్ని రాజన్న, రవిశంకర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనదారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీరప్ప, బీఆర్ఎస్ నాయకులు రవీందర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు రమేష్,రాయిని సత్యనారాయణ, సీహెచ్ మల్లేశం, పెద్దగొల్ల రాములు, పెంటయ్య, జోగు శ్రీధర్, పన్యాల రాజు, మహేష్, రాజన్న యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన డీఈ కుటుంబానికి ఎంపీ పరామర్శ



నవతెలంగాణ-న్యాల్‌కల్

కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ డీఈ వెంకట్‌రామ్‌రెడ్డి దంపతులు ఇటీవలే మృతి చెందిన విషయం విధితమే. కాగా ఎంపీ సురేష్ షెట్కార్.. మాజీ మంత్రి చంద్రశేఖర్‌తో కలిసి మండలంలోని గంగ్వార్ గ్రామంలో గల డీఈ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. తీర్థయాత్రలకు వెళ్లి మృతి చెందడం బాధాకరమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఉద్యోగ భద్రత కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తావన్నారు. అదేవిధంగా మల్గి గ్రామానికి చెందిన డ్రైవర్ మల్రెడ్డి కూడా అదే ప్రమాదంలో మృతి చెందగా.. వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ ముఖ్య జిల్లా నాయకులు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, చంద్రప్ప, సిద్ధి లింగయ్య స్వామి, బలవంత్ రెడ్డి, రత్నం, రఫీయేద్దీన్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జీవన్ రెడ్డి, సందీప్ రెడ్డి తదితరులున్నారు.

మహిళ మెడలో నుంచి బంగారం కాజేందుకు యత్నం

- అప్రమత్తమై ప్రతిఘటించిన మహిళ
- బస్సులో ప్రయాణిస్తుండగా ఘటన

నవతెలంగాణ-వట్‌పల్లి



బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళా మెడలో నుంచి బంగారు గుండ్లను దొంగిలించేందుకు వెనక సీట్లో ఉన్న వ్యక్తి ప్రయత్నించగా.. ఆ మహిళ అప్రమత్తమై ప్రతిఘటించింది. ఈ ఘటన డాకూర్ శివారులో ఆదివారం జరిగింది. ప్రయాణికురాలుతో పాటు ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం జోగిపేట నుంచి వట్‌పల్లికి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వస్తున్నది. అయితే ఆ బస్సు దాకూరు దాటిన తర్వాత ఓ ప్రయాణికురాలికి వెనక సీటులో కూర్చున్న వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్టు నటిస్తూ ఆ మహిళ మెడలోని బంగారు గుండ్లు కాజేయడానికి ప్రయత్నం చేశాడు. బంగారు గుండ్లను దొంగలించేందుకు ఆ మహిళ మెడ దగ్గరికి చేతులు చాపాడు. గమనించిన ఆమె.. వెంటనే అప్రమత్తమై ప్రతిఘటించింది. చేతులు తన మెడ దగ్గర ఎందుకు పెట్టావని ఆ వ్యక్తిని ప్రశ్నించగా.. అతడు తటపటాయించాడు. దాంతో ఆమెతోపాటు తోటి ప్రయాణికులు సైతం అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సదరు మహిళ చెప్పుతో కొడతానంటూ చేయి ఎత్తింది. తోటి ప్రయాణికులు వారించడంతో ఊరుకుంది. మళ్లీ ఇలాంటి దొంగతనాలకు పాల్పడితే జైలే దిక్కు అవుతుందని తోటి ప్రయాణికులు సైతం హెచ్చరించారు.

క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్తు



నవతెలంగాణ-రామచంద్రాపురం

క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఆర్చరీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రీడలో మొదటి బహుమతి గెలుచుకున్న ఉప్పల్ మెరీడియన్ పాఠశాల 4వ తరగతి చదువుతున్న చామల లక్ష్మి అభయ రెడ్డికి బంగారు పతకాన్ని అందించారు. ఈ సందర్భంగా టి.రాజు మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి ఆర్చరీ క్రీడను అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఆర్చరీ క్రీడలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధించడమే తమ లక్ష్యమన్నారు. ఈ క్రీడల్లో 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో విజయం సాధించిన క్రీడాకారులు విజయ వాడలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలో పాల్గొంటారన్నారు. ఈ పోటీలో మొదటి స్థానం చామల లక్ష్మి అభయ రెడ్డి, రెండో స్థానంలో శ్రీనిధి, మూడో స్థానంలో హేమలత విజయం సాధించారన్నారు. క్రీడాకారులను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి రామారావు, కోచ్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని.. ఈ ప్రభుత్వం అయినా లబ్ధిదారులకు ఇండ్లు మంజూ రు చేయాలన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప లబ్ధిదారుల సమావేశాన్ని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009లో రాజీవ్ గృహకల్ప ఇండ్ల కోసం 216 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందుకు అప్పులు చేసి.. బంగారం తాకట్టు పెట్టి రూ.49,000 రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించారన్నారు. ఏండ్లు గడిచిన లబ్ధిదారులకు మాత్రం రాజీవ్ గృహకల్ప ఇల్లు మంజూరు చేయలేదన్నారు. పెరుగుతున్న ధరలతో ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు ఫీజులు కట్టలేక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వమైనా రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులు రాము, రాజు, మహేష్, పద్మమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోనీ మజీదులో ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలను ప్రారంభించారు. ఆకాశంలో నెలవంక కనిపించడంతో అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాస దీక్షలను ఆదివారం ప్రారంభించారు. ఉదయం నుంచి మొదటి రోజు మజీదులో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు ముస్లిం సోదరులు హాజరై మొదటి ఉపవాస దీక్ష విరమణ చేశారు. జనాబ్, అన్వర్ సాబ్, తలహ, ఖలీల్, ఇక్బాల్, మహ్మద్ నసీరుద్దీన్, కాజా మైనుద్దీన్, మొయినుద్దీన్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

రాములు నాయక్‌కు పలువురి పరామర్శ



నవతెలంగాణ-టేక్మాల్

మండలంలోని మల్కాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాము లు నాయక్‌కు ఇటీవల రోడ్డు ప్రమా దంలో తీవ్రగాయాలు అయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స తర్వాత డిచార్జి అయి.. స్వగృ హానికి వచ్చారు. ఈ విషయం తెల్సుకున్న కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్ ఆదివారం రాములు నాయక్ ఇంటికెళ్లి పరావ ర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన తోపాటు మండల జోగిపేట ఏఎంసీ వైఎస్ చైర్మెన్ వై.సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ లు మల్లారెడ్డి, రాజుగౌడ్ సీనియర్ మండల కాంగ్రెసు నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం




నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన ఎమ్మ రాజ్యం అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మృతి చెందింది.ఈ విషయాన్ని లీలా గ్రూప్ చైర్మెన్ డాక్టర్ మోహన్ నాయక్ దృష్టికి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సుధాకర్ రెడ్డి తీసుకెళ్లగా మోహన్ నాయక్ వెంటనే స్పందించి.. మృతురాలి కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో రమావత్ రాజు, మలవత్ బాబు, సిద్ధయ్య , రాజు, రవి, స్వామి, నాగరాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా మహేష్ రెడ్డి

నవతెలంగాణ-టేక్మాల్

ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా టేక్మాల్ మండల్ శేరిపల్లి గ్రామానికి చెందిన కుర్తి మహేష్ రెడ్డి నియామకం అయ్యారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తనను.. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేసి.. తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర (యన్‌యస్‌యూఐ) కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకట స్వామికి, జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరికి, రాష్ట్ర ఇంచార్జ్ ఫహాద్. ప్రతీక్ సింగ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకి, తదితర నాయకులకు పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.





అక్రమ బ్లాస్టింగ్‌లపై అధికారుల చర్యలేవి..?

- మల్లుపల్లి గ్రామస్తుల మండిపాటు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

నవతెలంగాణ-శివ్వంపేట

ఎన్నో రోజులుగా గ్రామానికి ఆనుకొని ఉన్న భూముల్లో బండరాళ్లను అక్రమంగా బ్లాస్టింగ్‌లు చేస్తూ సొమ్ము చేసుకుంటూ గ్రామస్తులకు తీవ్రంగా ఇబ్బందులు కలిగిస్తున్నారని మల్లుపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులోని సర్వేనెంబర్ 526లో పెద్దపెద్ద బండరాళ్లతో కూడిన భూములుండగా గోనెగరి శ్రవణ్ కుమార్ పేరిట భూమి ఉన్నట్లుగా చూపిస్తూ మాజీ సర్పంచ్ గ్యాదరి భాగ్యమ్మ కుమారుడు గ్యాదరి శ్రీనివాస్ అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ బ్లాస్టింగ్‌లపై అధికారులకు సమాచారం అందించిన చర్యలు తీసుకున్న దాఖలలే లేవని గ్రామస్తులు మండిపడ్డారు.

నిషేధిత పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్‌లు..

గత నెల రోజులుగా సర్వేనెంబర్ 526లో నిషేధిత పేలుడు పదార్థాలను ఉపయోగించి అక్రమంగా బ్లాస్టింగ్‌లు చేపడుతున్నారని పోలీస్ సిబ్బందికి క్లంప్లంట్ చేసిన గాని, రెవిన్యూ అధికారులకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన గాని పట్టించుకున్న నాథుడే లేడని గ్రామస్తులు మండిపడితున్నారు.

అధికారుల మౌనంపై గ్రామస్తుల అనుమానాలు

మల్లుపల్లిలో ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా బ్లాస్టింగ్‌లు జరుగుతుంటే అధికారులు మౌనం వహించడంపై గ్రామస్తులు ఎన్నో అనుమానలను వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా చిన్న సమస్య వచ్చిందంటే వాలిపోయే పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టకపోవడం, నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకోకపోవడం, ఇంటికి ఒక ట్రాక్టర్ మొరం తెచ్చుకుంటేనే పర్మిషన్ కావాలని చెప్పే రెవిన్యూ సిబ్బంది కనీస చర్యలు చేపట్టకపోవడం, బ్లాస్టింగ్‌లు చేస్తే యంత్రాలను స్వాధీనం చేసుకునే మైనింగ్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం వెనక అధికారుల మతలబు ఏంటో అర్థం కావడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు అక్రమార్కులు ఏమైనా అమమ్యాలు అందించి, చేతులు తడిపారా...? అని అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అధికారులైన చర్యలు తీసుకోవాలి.

మండల స్థాయి అధికారులు చర్యలకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదేంటే కనీసం జిల్లా అధికారులన్నా పట్టించుకుంటే మల్లుపల్లి సమస్య పరిష్కారం అవుతుందేమోనని గ్రామస్తులు ఆశ పడుతున్నారు. గ్రామస్తుల ఆరోపణలు నిజమొ కాదో అక్రమార్కులపై చర్యలు చేపట్టాలన్న గాని జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బ్లాస్టింగ్‌లపై గతంలో విచారణ చేపట్టాం...



మల్లుపల్లి బ్లాస్టింగ్ లపై గతంలో పిర్యాదు చేస్తే అక్కడికి వెళ్లి విచారణ చేపట్టాం. అక్కడ బ్లాస్టింగ్ ఆనవాళ్లు దొరకలేదు. భూమి కేసు హైకోర్టులో పెండింగ్ ఉందని రెవిన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని సూచించాం. ఇప్పుడేమైనా బ్లాస్టింగ్‌లు చేస్తే మాత్రం తప్పకుండ కేసులు నమోదు చేస్తాం.

-ఎస్ఐ, మధుకర్ రెడ్డి

ఇనాం మక్త భూమి ఇది.. అందులో బ్లాస్టింగ్ లా



దొంతి దొరవారి భూమి ఇది. ఇప్పుడు మాది పట్టా అని ఎవరో అక్కడికి వచ్చి భూమి మాపేరున పట్టా చేసుకున్నాం అని అంటున్రు. ఇక్కడ స్మశానవాటిక కూడ నిర్మించారు. మేమడిగితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. బ్లాస్టింగ్‌లపై అధికారులు చర్యలు చేపట్టాలి

-గ్యాదరి కిష్టయ్య, మల్లుపల్లి

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- మద్యానికి బానిసలవుతున్న ప్రజలు
- ఎక్సైజ్ అధికారులకు నెలనెలా మామూళ్లు
- కండ్లుండి బెల్ట్ షాపుల వైపు చూడలేకపోతున్న ఎక్సైజ్ అధికారులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నీ నర్సాపూర్, కౌడిపల్లి, చిలిపిచ్చెడు, శివంపేట్, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలలోని వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఎక్కువ శాతం గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో, హెూటలలో బెల్ట్ షాపులు జోరుగా సాగుతున్నాయి. ఈ బెల్ట్ షాపుల వల్ల గ్రామాలలోని యువత ప్రజలు మద్యానికి బానిస లై పనులు చేసుకునేందుకు సైతం సక్రమంగా వెళ్లడం లేదని ఆయా గ్రామాల్లోని మహిళలు అంటున్నారు. పనులకు వెళ్లిన వారు సైతం వచ్చిన డబ్బులు మద్యానికే ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బెల్టు షాపుల వల్ల పచ్చని సంసారాల్లో గొడవలు జరుగుతున్నాయని వాపోతున్నారు. మద్యానికి బానిసలైన వారు డబ్బులు లేని సమయంలో డబ్బుల కోసం ఇండ్లలో గొడవలు పడడమే కాకుండా దొంగతనాలకు సైతం పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు మాత్రం వైన్స్ దుకాణదారులు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి గ్రామాల వైపు తొంగి చూడడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. నర్సాపూర్ పట్టణంలో బెల్ట్ షాపులకు మద్యాన్ని అమ్మేందుకు అందరూ వైన్స్ దుకాణదారులు సిండికేట్గా ఏర్పడి ఒక దుకాణం నుండి గ్రామాలలోని బెల్ట్ షాపులకు మద్యాన్ని అమ్ముతున్నారని సమాచారం. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులకు తెలిసినప్పటికీ అటువైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆలయాల వద్ద సైతం మద్యం విక్రయాలు..

నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు దేవాలయాల వద్ద సైతం మద్యం విక్రయిస్తున్నారని పలువురు అంటున్నారు. కౌడిపల్లి మండల పరిధిలోని తునికి నల్ల పోచమ్మ దేవాలయం వద్ద, శివంపేట్ మండల పరిధిలోని సిగిండ్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాల వద్ద ఉన్న దుకాణాలలో మద్యాన్ని బహిర్గతంగా విక్రయిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ పై అధికారులు కలుగజేసుకొని గ్రామాలలో కొనసాగుతున్న బెల్ట్ షాపులను దేవాలయాల వద్ద అమ్ముతున్న మద్యాన్ని అరికట్టే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

పట్టుపడితే చర్యలు తీసుకుంటాం..

ఎక్సైజ్ సీఐ పద్మ

గ్రామాలలో బెల్ట్ షాపుల్లో మద్యం పట్టుబడితే ఆయా షాపులపై చర్యలు తీసుకుంటాం, ఎప్పటికప్పుడు గ్రామాలలో తమ సిబ్బంది చేత తనిఖీలు చేపడుతున్నాం, మద్యం దొరికిన పాలు దుకాణాలపై కేసులు సైతం నమోదు చేయడం జరిగిందని ఆమె వివరణ ఇచ్చారు.

రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మెన్‌ను నియమించేది ఎప్పుడు..?

- పదవి కోసం ఎదురుచూస్తున్న పలువురు నాయకులు
- వెంటనే నియమించాలని వేడుకోలు



నవతెలంగాణ-నిజాంపేట

దాదాపు 6 నెలల నుంచి రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మెన్‌ను నియమిస్తామంటూ ప్రభుత్వము లీకేజీలు ఇస్తున్నది. ఎస్టీకి రిజర్వేషన్ అయిందని ఆశలు కల్పిస్తున్నది. అందులో మెదక్ నియోజకవర్గంలోని రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మెన్‌ను ఎప్పుడు నియమిస్తారని ఎస్టీ నాయకులు ఎదురుచూస్తున్నారు. మండలంలోని ఎస్టీ నాయకులు ఎందరో గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు. గత మూడు నెలల క్రితమే కొందరు చైర్మెన్ పదవి నాకే వస్తుందని లీకేజీలు కూడా ఇవ్వడం జరిగింది. ఇప్పటికే పార్టీ పదవులను నామినేటెడ్ పోస్టులను నియమించడంలో కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం వహిస్తుందని కొందరు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. నామినేటెడ్ పోస్టులను, పార్టీ పదవులను నియమించనట్లయితే అసంతృప్తితో కొందరు నాయకులు వేరే పార్టీలో చేరే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఇతర పార్టీలకు వెళ్లకుండా ఉండాలంటే వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెంటనే నామినేటెడ్ పదవులను పార్టీ పదవులను అప్పజెప్పినట్లయితే పార్టీ బలపడుతుందని మండలంలో పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధిష్టానము వెంటనే స్పందించి రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని భర్తీ చేయాలని పలువురు కోరుకుంటున్నారు.

వసతులు లేని అంగన్వాడీ బిల్డింగ్

- అందులోకే అంగన్వాడీ కేంద్రాన్ని తరలించాలని సూపర్వైజర్ ఒత్తిడి!
- ఎమ్మెల్యేతో పరిశీలించి ప్రారంభించాలని స్థానికుల విజ్ఞప్తి
- ఆయమ్మను నియమించాలి.. నీటి వసతులు కల్పించాలని వేడుకోలు



నవతెలంగాణ-పాపన్నపేట

మండల కేంద్రమైన పాపన్నపేటలోని అంగన్వాడీ సెంటర్-2ను వసతుల్లేని నూతన భవనంలోనికి తరలించాలని సూపర్వైజర్లు ఇబ్బంది పెడుతు న్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్వాడి సెంటర్-2ను గత కొన్ని సంవ త్సరాల నుంచి ఓ ప్రైవేటు భవనములో నిర్వహిస్తున్నారు. అయితే ఆ సెంటర్‌కు రెండేండ్ల క్రితం భవనం మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేశారు. అయినప్పటికీ అందులో నీటి వసతులు.. బాత్రూం డ్రైనేజీలు సరిగా లేకపోవడం, భవన నిర్మాణం సరిగా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బేస్మెట్ లెవెల్‌లోనే పెద్దప గులు వచ్చాయని ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితిలో భవనం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించి ప్రారంభించాలని కోరుతున్నారు. ప్రారంభం చేయని భవనంలోకి వెళ్తే.. ఏమైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంగన్వాడి ఆయామ్మను నియమించి నూతన భవనంలో నీటి వసతిని కల్పిస్తేనే పిల్లలను నూతన భవనాలకు పంపిస్తామని పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు.



నస్కల్ రోడ్డు పనులు పున: ప్రారంభం



నవతెలంగాణ-నిజాంపేట

ఎట్టకేలకు నస్కల్ రోడ్డు పనులను కాంట్రాక్టర్ పున: ప్రారంభించారు. నస్కల్, రాంపూర్, నందగోకుల్, చల్మెడ, గ్రామాలకు బీటీ రోడ్డు వేయాలని జనవరి నెలలో నస్కల్ గ్రామానికి చెందిన కొందరు నాయకులు రిలే నిరాహార దీక్షలు చేశారు. బీటీ రోడ్డు వేసే వరకు రిలే నిరాహార దీక్షలు ఆపేదే లేదని స్పష్టం చేశారు. దాంతో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు స్పందించి కాంగ్రెస్ నాయకుల చేత రిలే నిరాహార దీక్షలను విరమింపచేశారు. ఎమ్మెల్యే మాట ఇచ్చిన ప్రకారం రోడ్డుపనులను ఆదివారం పున:పారంభించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లా డుతూ.. బీటీ రోడ్డును త్వరగా పూర్తి చేసి, నాలుగు గ్రామాల ప్రజల కష్టాలను తొలగించాలన్నారు. కాంట్రాక్టర్ స్పందించి చేసిన రోడ్డు పనులకు బిల్లులను త్వరగా చెల్లించేలా ఏర్పాటు చేయాలని అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేస్తానన్నారు. చేసిన పనులను మధ్యలో నిలిపివేయడం వలన ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, టౌన్ అధ్యక్షులు నజీరుద్దీన్, చెప్పెట ముత్యం రెడ్డి, నార్లాపూర్ తాజా మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, ముత్యాల సత్యనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సరాఫ్ యాదగిరి, బక్కన్న గారి లింగం గౌడ్, నాగరాజు, నిలం బాబు పాల్గొన్నారు.

తూప్రాన్ గీతా స్కూల్లో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



- గీతా స్కూల్ కరస్పాండెంట్ పి.రామాంజనేయులు

నవతెలంగాణ-తూప్రాన్

గీతా స్కూల్‌లో ఫేర్ వెల్ పార్టీడే పార్టీ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా హైస్కూల్లోని పదో తరగతి వీడ్కోలు సమావేశంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందో త్సాహాలతో ఎంతో ఉత్సా హపరితంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక మంలో పాఠశాల కరస్పాం డెంట్ పి.రామాంజనేయులు మా ట్లాడుతూ.. పదో తరగతి అనేది ప్రతి విద్యార్థికి కీలక దశ అని, బాల్య స్మృతులన్ని ఇక్కడే పురుడు పోసుకుం టాయ న్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఎదిగి, ఒదిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ సి.హెచ్. వెంకట కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నవతెలంగాణ-శివ్వంపేట

గత నాలుగైదు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉపాధి హామీ పీల్డ్ అసిస్టెంట్ మృతి చెందిన సంఘటన మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జోగు రాములు (48) గత కొన్నేండ్ల నుంచి ఉపాధి హామీలో పీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత సంవత్సరం పక్షవాతం వచ్చి అనారోగ్యం బారిన పడ్డారు. వెంటనే స్పందించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా ఆరోగ్యం కొంత కుదుట పడింది. అయితే గత నాలుగైదు రోజులుగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన్ను. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం రాములు మృతి చెందారు. అందరితో కలుపుగోలుగా ఉండే ఫీల్డ్ అసిస్టెంట్ మృతితో పిల్లుట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.







ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-గజ్వేల్

జన ఔషది దివాస్ కార్యక్రమంలో భాగంగా సంగాపూర్ రోడ్డులో గల ప్రధాన మంత్రి భారతీయ జన ఔషది కేంద్రం ప్రొప్రైటర్ కేతోజి భావన రమణా చారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. డాక్టర్ ఆకుల నరేశ్ బాబు సుమారు యాభై మంది ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అని, ప్రజలకు సేవ చేయడం జీవితానికి ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రజలకు అతితక్కువ ధరలకే నాణ్యమైన మందులు అందించాలనే సంకల్పంతో, ఉన్నత లక్ష్యంతో జన ఔషది కేంద్రాల ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన మందులు అందిస్తుందిని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేసిన జన ఔషది యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కేతోజి వినోద్, ఇన్స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్, మిందె వెంకటేష్, విజయ్ కుమార్, హరీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడే పొద్దు తిరుగుడు పంట నమోదుకు చివరి రోజు



నవతెలంగాణ-తొగుట

పొద్దు తిరుగుడు పంట నమోదుకు నేడు చివరి రోజు ఏఈఓ సాయి తెలిపారు. ఆదివారం ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం వెంకట్రావుపేట, లింగాపూర్, జప్తి లింగారెడ్డి పల్లి, చందాపూర్ గ్రామ రైతులకు నేడు సోమవారం రోజు పొద్దు తిరుగుడు పంట నమోదు చేసుకునే నేందుకు చివరి రోజు అని తెలిపారు. కావున రైతులు ఇప్పటి వరకు పొద్దు తిరుగుడు పంట నమోదు చేసి కొని రైతులు ఏఈఓను సంప్రదించి నమోదు చేసుకోవాలాని సూచించారు. పంట అమ్మే సమయంలో ఆన్లైన్ లో నమోదు చేసుకో నట్లయితే ధాన్యం విక్రయించే అవకాశం ఉండదని పేర్కొన్నారు. కావున రైతులు ఇట్టి విషయాన్నీ గమనించి తప్పకుండ పంట నమోదు చేసుకోవాలి కోరారు. ఏఈఓ నెంబర్ 6304901707.

వివాహానికి హాజరైన నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

మండల కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు ర్యాకం యాదగిరి మేన అల్లుడు జి.శ్రావణ్ కుమార్, శిరీష వివాహం అలియబాద్‌లోని ఓ ప్రయివేటు పంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ వివహా వేడుకలకు పాములపర్తి మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి, కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య, మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌లు వేరు, వేరుగా హాజరైన నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

గృహప్రవేశానికి హాజరైన నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి నవీన్ రెడ్డి నూతన గృహ ప్రవేశానికి పాములపర్తి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిర్మల్ రెడ్డి, మర్కుక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తండా కనకయ్య గౌడ్ ,కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్ లు హజరైయ్యారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి , పాములపర్తి కాంగ్రెస్ అధ్యక్షులు క్రాంతి కుమార్ ,బోయిని లక్ష్మన్, నరేష్ బాబు, తదితరులున్నారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-సిద్దిపేట

చిన్నకోడూరు మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబనికి చెందిన రాళ్లబండి లింగం కూతురు వివాహానికి చిన్నకోడూరు మండల కాంగ్రెస్ నాయకులు 50 కిలోల బియ్యన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రాజకీయ నాయకుడు నిరుపేద కుటుంబనికి తన వంతు సహాయం చేసినప్పుడే జీవితానికి ఒక నిజమైన అర్థం ఉంటుందాన్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్, ఉపాధ్యక్షులు సందబోయిన పర్శరాం, ఎస్సీ సెల్ మాజీ కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఉడుతా జయంత్, తదితరులు పాల్గొన్నారు.

మోహన్ రావును పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ



నవతెలంగాణ-దౌల్తాబాద్

విద్యుత్ ప్రమాదానికి ఇటీవల గురై చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్న దొమ్మాట మాజీ సర్పంచ్ మోహన్ రావు ను మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఆదివారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట వారి నివాసంలో పరామర్శించారు. మోహన్ రావు ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యుత్ ప్రమాదం జరగడానికి కారణం జరిగిన తీరును తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు. వైద్యుల సలహా మేరకు చికిత్స కొనసాగిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింతకింది మంజూరు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్సీ



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల కేంద్రానికి చెందిన దుదుక బాలమణి -నర్సింలు దంపతుల కుమారుడు వివాహం రాయపోల్ ఓ ప్రైవేట్ ఫంక్షన్ లో ఆదివారం జరగగా ఈ వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చింతకింది మంజూరు, హనుమంతు రాజు, దుదుక శ్రీనివాస్, దుదుక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


కవి గాయకులు దరువు అంజన్నకు ప్రముఖుల పరామర్శ



నవతెలంగాణ-రాయపోల్

ఓయూ జేఏసీ చైర్మెన్, కవి గాయకులు దరువు అంజన్న మాతృమూర్తి మృతి చెందిన ఈ విషయం తెలుసుకొన్న ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకులు మహమ్మద్ సుల్తానా ఉమర్. ఆదివారం గాజులరామారం హైదరాబాద్ అంజన్న నివాసంలో వారి కుటుంబాన్ని పరామర్శించి లలితమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లలితమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ కోశాధికారి మహమ్మద్ ఉమర్, మహమ్మద్ ఇంతియాజ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-వర్గల్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నెంటూర్ గ్రామంలో జరిగింది. బేగంపేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెంటూర్ గ్రామానికి చెందిన జంపాల సత్తయ్య (41) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపనికి గురై శనివారం మధ్యాహ్నం సమయంలో పురుగుల మందు తాగాడు. వారి కుటుంబసభ్యులు గుర్తించి లక్ష్మక్కపల్లి లోని ఆర్వీయం హాస్పిటల్ కి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బేగంపేట్ ఎస్సై తెలిపారు.

ఇక ఒర్రెల ఇసుక వంతు..!



- ఇసుక అక్రమ రవాణకు అధికారులు అడ్డుకట్ట వేసినా..
- ఒర్రెల ఇసుకను వదలని మాఫీయదారులు
- రెయింబవళ్లు ట్రాక్టర్లతో ఒర్రెల ఇసుక తరలింపు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గాగీల్లపూర్, తోటపల్లి, దేవక్కపల్లి గ్రామ శివారుల్లో విస్తరించిన మోయతుమ్మెద వాగు ఇసుకను మాఫీయదారులు అక్రమంగా తరలించకుండా 17 ఫిబ్రవరి 2025న తహసీల్దార్ అధ్వర్యంలో మోయతుమ్మెద వాగులోకి వాహనాలు వెళ్లకుండా జేసీబీ యంత్రం సహాయంతో దారులపై గుంతలు తవ్వి అడ్డుకట్ట వేశారు. దీంతో ఇసుక అక్రమ రవాణకు అధికారులు అడ్డుకట్ట వేయడంతో మాఫీయదారులు ఇక ఒర్రెల వంతంటూ రెయింబవళ్లు ఇష్టారీతిన ఇసుకను తొడుతూ ట్రాక్టర్ల ద్వార అక్రమంగా తరలిస్తున్నారు. ప్రకృతి ప్రసాదించిన అరకొర వనరులను దోపిడీ చేయడమే లక్ష్యంగా మాఫీయదారులు అధికారుల కళ్లుగప్పి ఒర్రెల ఇసుకను సైతం వదలడం లేదని. ఇసుక అక్రమ రవాణను పూర్తి స్థాయిలో అధికారులు నియంత్రించాలని ఒర్రెల పరిసర ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

ఒర్రెల ఇసుక దోపిడీ..

మండల పరిధిలోని కల్లేపల్లి, గూడెం, గుండారం గ్రామాల శివారుల్లో ఒర్రెలు ప్రవహిస్తూ చెరువుల్లో నింపుతాయి. గత కొన్నేండ్లుగా ఒర్రెలలో నిల్వ ఉన్న ఇసుకను మాఫీయదారులు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ రెయింబవళ్ల ట్రాక్టర్ల ద్వార తరలిస్తున్నారు. ఒర్రెలలో ఇసుకను మాఫీయదారులు తరలిస్తుండడంతో పరిసర ప్రాంతాల రైతుల పంట భూములు కోతకు గురై భూగర్భ జలాలు అడుగంటి పంట సాగుకు ఇబ్బం దులు ఎదురవుతాయని, సంబం ధిత అధికారులు ఒర్రెల ఇసుకను అక్రమంగా తరలించకుండా శ్రద్ధ చూపాలని గుండారం గ్రామ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమానత్వమే నా లక్ష్యం

-టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రాజులు

నవతెలంగాణ-గజ్వేల్

సమానత్వమే తన లక్ష్యమని తనకు పుట్టుకతోనే వచ్చిందని టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు గజ్వేల్ మండలం రిమ్మనగూడ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పదవి విరమణ చేసిన రాజులు అన్నారు. ఆదివారం సూర్య నమస్కారాలు బృందం ఏర్పడి ఏడవ వార్షికోత్సవం పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గల్ మండలం చౌదర్పల్లికి చెందిన తాను మొదటి నుంచి అట్టడుగు వర్గాల ప్రజల మధ్య పెరిగి వారి ఆలోచనలతో అందరూ సమానం ఉండాలని లక్ష్యంతోనే తాను ముందుకు వెళ్తానన్నారు. 40 సంవత్సరాలుగా ఉద్యోగ చేసి 61 సంవత్సరానికి ఉద్యోగ పదవి విరమణ చేస్తున్న సందర్భంలో సూర్య నమస్కారాల బృందం తనను ఘనంగా సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ధనిక పేద అనే తేడా లేకుండా సమాజంలో అందరు సమానం ఉంటే సమస్యలు రావని ఆయన అన్నారు. ఏడు సంవత్సరాలుగా సూర్య నమస్కార బృందంతో నడిస్తే తన ఆరోగ్యం పదిలంగా ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సూర్య నమస్కారాలు బృందం సభ్యులు తదితరులు ఘనంగా సన్మానం చేశారు.



పార్టీ నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవు

-కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి హెచ్చరిక

నవతెలంగాణ-బెజ్జంకి



కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలు, విధివిధా నాలను ఉల్లంఘించి వ్యతిరేకం గా వ్యవహరించే పార్టీ శ్రేణులపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ నిర్ణయం ప్రకారం పార్టీపరమైన చర్యలు చేపడుతామని కాంగ్రెస్ పార్టీ మండలా ధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు తమ సందేహాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మండల పార్టీ దృష్టికి తీసుకువచ్చి ఐక్యతగా నివృత్తి చేసుకోవాల్సిన బాధ్యత శ్రేణులందరిపై ఉందని రత్నాకర్ రెడ్డి సూచించారు.

ఉపాధ్యాలయులు మౌనంగా ఉండొద్దు

- ప్రొఫెసర్ కాసిం

నవతెలంగాణ-గజ్వేల్

పెట్టబడిదారి ఉత్పత్తి విధానం సామాజిక సంబంధాలను ధ్వంసం చేస్తుందని ఉపాధ్యాయులు మౌనంగా ఉండరాదని ప్రొఫెసర్ కాసిం అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో టీపీటీఎఫ్ విద్యా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ.. నిరంతర పోరాటమే సామాజిక క్రమాన్ని మార్చగలదన్నారు. దేశంలో నేడు ప్రభుత్వాలు పాసింజం మాటున పనిచేస్తున్నాయని నియంతృత్వ ధోరణలను ఎదిరించాల్సిన అవసరం మేధావులపై ఉందన్నారు. సంక్షోభ కాలంలో ఏటికి ఎదురీదైన మేధావులు ఎన్ని అణచివేతలు ఎదురైనా సమాజ శ్రేయస్సుకు పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. మేధావులు ప్రజలను చైతన్య పరుస్తూ ప్రభుత్వాలను అవసరమైనప్పుడు ప్రశ్నిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రాంతంలో టీపీటీఎఫ్ పాత్ర చాలా గణనీయమైనదని ఇక్కడి కార్యకర్తలు రాష్ట్రంలోని టీపీటీఎఫ్‌కు ఆదర్శమని చెప్పారు. ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు విద్యను ప్రయివేటుపరం చేసే ఆలోచనలను, ప్రయత్నాలను మానుకొని ప్రభుత్వ పాఠశాలను మరింత బల పడేటట్లు కృషి చేయాలని కోరారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు రాజులు పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సభకు గజ్వేల్ జోన్ అధ్యక్షులు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు ప్రకాష్ రావు, ఏపీటీఎఫ్ పూర్వాధ్యక్షులు ఎ.నరసింహారెడ్డి, పూర్వ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రామచంద్రం, వై.అశోక్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నరేందర్, జోన్ పరిధిలోని అధ్యక్షులు నాగరాజు, పర్వతం నరసయ్య, గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, రాజనర్సింహ, వెంకట్ పాల్గొన్నారు. సీనియర్ నాయకులు పి ఎల్లయ్య, దమ్మన్ మల్లయ్య, శంకర్, పరమేశ్వర్, జి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఉమామహేశ్వర రథోత్సవం

నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో ఉమామహేశ్వర పాంచాహ్నిక బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ నుంచి రథంపై శివపార్వతులు విగ్రహాలను కూర్చుండ బెట్టి ఊరేగించారు. రథంపై ఉన్న ఉమామహేశ్వర స్వామిని భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రాత:కాల పూజ, అభిషేకము, హవనము, చక్రతీర్థము, క్షేత్రబలి, మహా పూర్ణాహుతి, అనబ్రుదము, మహాదాశీర్వచనము, ఋత్విక్ సన్మానము, సమయా నుకూలంగా ఆధ్యాత్మిక, ధార్మిక సేవా కార్యక్రమమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గుండం భట్ల వెంకట నరసింహ శర్మ, గ్రామ తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్, మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్, ఉమా మహేశ్వర స్వామి ఆలయ చైర్మెన్ బల్లి శ్రీనివాస్ గుప్త, ఉమా మహేశ్వర స్వామి, మాజీ ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.



నిరుపేద వధువుకు పుస్తెమెట్టెలు అందజేత

నవతెలంగాణ-రాయపోల్

నిరుపేద కుటుంబానికి చెందిన వధువుకి పుస్తే మట్టెలు అందజేసి మానవత్వం చాటుకున్నారు కాంగ్రెస్ నాయకులు పాల రామా గౌడ్. ఆదివారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఇస్తారి రాజమణి- రాజయ్య దంపతుల కూతురు పూజ వివాహానికి పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఆడపిల్ల తెలియజేయడం తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారిందని అలాంటి పరిస్థితులలో మంతూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఇస్తారి రాజమణి రాజయ్య దంపతులు వారి కూతురు పూజా వివాహం చేయడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలని ఉద్దేశంతో పుస్తే మెట్టెలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పట్నం యాదగిరి, గ్రామ ఉపాధ్యక్షులు నర్సింలు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు జనార్ధన్ రెడ్డి, ఈరమైన యాదగిరి, డా.చందు,మాజీ సర్పంచ్ మల్లేశం,కుంటి భిక్షపతి, పెద్ద మల్లేశం,సతీష్,మహేందర్ రెడ్డి,భూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నిత్య సాధనతోనే విజయాలు సొంతం

- డాక్టర్ అరవింద్ కుమార్
- లచ్చపేటలో ఘనంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్
- విజేతలకు నగదు బహుమతి అందజేత



నవతెలంగాణ-దుబ్బాక

క్రీడాకారులకు గెలుపోటములు సహజమని, నిరాశ చెందకుండా నిత్య సాధన చేస్తేనే భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవచ్చని దంత వైద్యశాల డాక్టర్ అరవింద్ కుమార్ స్పష్టం చేశారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో తెలంగాణ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల సిద్దిపేట సౌజన్యంతో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న "టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్" లో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో దుబ్బాక వర్సెస్ లచ్చపేట టీమ్లు హెూరాహెూరీగా తలపడ్డాయి. దుబ్బాక ఎంసీఎఫ్ టీం పై లచ్చపేట టీం గెలుపొందగా.. డాక్టర్ అరవింద్ కుమార్,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.బుచ్చిబాబు,తాజా మాజీ కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్ ల చేతుల మీదుగా విన్నర్ టీం (లచ్చపేట) కు రూ.12,116 ,రన్నర్ టీం (దుబ్బాక) కు రూ.7,116 నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు ఎర్రగుంట శ్రీనివాస్,జీ.ఎం.మోహన్,బత్తిని సతీష్ గౌడ్,మైసగోని కిషన్ గౌడ్ కూరపాటి సంతోష్ కుమార్ పలువురు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులను అభినందించిన ఎంఈఓ

నవతెలంగాణ-సిద్దిపేట

సంగారెడ్డిలో జరిగిన ఎస్‌బీఆర్ కరాటే ఛాంపియన్షిప్ టోర్నమెంటులో సిద్దిపేట నుంచి పాల్గొన్న కరాటే విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినందుకు వారిని ఎంఈఓ రాజా ప్రభాకర్ రెడ్డి అభినందించారు. ఆదివారం జపాన్ కరాటే షోటోకాన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక సహస్ర హై స్కూల్‌లో అభినందన కార్యక్రమం సీనియర్ కరాటే మాస్టర్ భాగ్యరాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి పోటీ పరీక్షలను తట్టుకోవాలంటే శారీరక దృఢత్వం కూడా అవసరమని, అందులో కరాటే అతి ముఖ్యమైనదని, అమ్మాయిలు తప్పకుండా ఈ కరాటేలో ప్రావీణ్యం తప్పనిసరని, తద్వార ఆరోగ్యం, శారీరక ఎదుగుదల, బరువు నియత్రణలో ఎంతోగానో ఉపయోగం అన్నీ అన్నారు. అనంతరం కరెంట్ విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సహస్ర స్కూల్ కరస్పాండెంట్ శ్రవణ్ కుమార్, ప్రిన్సిపాల్ శాంతి కిరణ్, బ్లాక్ బెల్ట్ కోచ్స్ తేజస్విన్, ప్రవీణ్, కీర్తన, శ్రీవల్లి, మాన్వి, హరితేజస్విని, రుద్రమహీనందన్, తల్లి తండ్రులు పాల్గొన్నారు.



కేసీఆర్‌ను కలిసిన జుబేర్ పాషా

నవతెలంగాణ-ములుగు



రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా గజ్వేల్ శాసనసభ్యులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆదివారం ఎర్రవల్లిలోనే తన ఫామ్ హౌస్‌లో మర్యాద పూర్వకం గా కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ స్టేట్ బీఆర్ఎస్ యూత్ వింగ్ అండ్ ఏజెడ్ ఫౌండేషన్ చైర్మెన్ జుబేర్ పాషా.

ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న మ్యాకల

నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో గల పురాతనమైన ఆలయం సుమారు 500 సం॥లకు పూర్వమే కాకతీయ నిర్మాణ శైలిలో నిర్మితమై నిర్మాణమైన అంగడికిష్టాపురం గ్రామంలో కొలువు దీరిన లయకారుడు, భక్త సులభుడు అయిన ఉమామహేశ్వర స్వామి వారి పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవంలో బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు తన వంతుగా రూ.5116 ఆలయ చైర్మెన్ బల్లి శ్రీనివాస్ గుప్తాకు ఆలయ ప్రధాన అర్చకులు గుండం భట్ల వెంకట నరసింహ శర్మ, గ్రామ తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్‌తో కలసి అందజేశారు.

ప్రారంభమైన భానుడి భగభగలు

- వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



నవతెలంగాణ-సిద్దిపేట

వేసవికాలం వచ్చిందంటే ఎండ తీవ్రతను తట్టుకోవాలంటే ఎవరికైనా ఇబ్బంది. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంది. ఏప్రిల్, మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కానీ మార్చి మొదటి వారంలోనే ఎండల తీవ్రత చూస్తుంటే ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అనుకోవచ్చు. ఆదివారం 31 డిగ్రీల ఉష్ణోగ్రత సిద్దిపేటలో నమోదయింది. ఎండ తీవ్రత మూలంగా ప్రజలు వడదెబ్బకు గురవుతూ ఉంటారు. వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ ఎలా వస్తుంది....

తీవ్రమైన ఎండ, వడ గాల్పులు వీస్తున్న సమయంలో ప్రయాణం చేసిన, ఎండలో పని చేసిన వడదెబ్బ తగులుతుంది.

వడదెబ్బ లక్షణాలు....

తీవ్రమైన తలనొప్పి, నాలిక ఎండిపోవడం, నాడీ వేగంగా కొట్టుకోవడం, అధిక దాహం, శరీరంలో నీరు కోల్పోవడం, వాంతులు, విరోచనాలు, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మార్క స్థితిలో వెళ్లడం.

ప్రథమ చికిత్స...

వడదెబ్బకు గురైన వ్యక్తిని నీడ ప్రదేశానికి చేర్చాలి. శరీరాన్ని చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరం తుడవాలి. వడదెబ్బకు గురి అయిన వ్యక్తికి మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్ల, లేదా ఓఆర్ఎస్ ద్రావం లేదా ఉప్పు, పంచదారతో కలిపిన నీటిని త్రాగించాలి. ప్రథమ చికిత్స చేసిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యుల సలహాల ప్రకారం మందులు వాడాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయట తిరగకుండా ఉండడం, ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నప్పుడు బయటకు వెళ్లినప్పుడు తలకు టోపీ, గొడుగు, రుమాల్ సహాయం తీసుకోవాలి. తప్పనిసరి పరిస్థితిలో ప్రయాణం చేసినప్పుడు మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వెంట తీసుకువెళ్లాలి. ముఖ్యంగా పిల్లలు ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయటకు వెళ్లడం గాని, ఆడుకోవడం గానీ చేయకుండా ఉండాలి, పిల్లలు నీడ ప్రదేశంలో ఆడుకోవడం మంచిది. ఆరు నెలలోపు శిశువులకు కేవలం తల్లిపాలు మాత్రమే త్రాగించాలి. సాధ్యమైనంత వరకు కాటన్ దుస్తులు ధరించడం మంచిది. నీరు, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది. ఇంటిలోనికి వడగాల్పులు, ఎండ తీవ్రత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.